RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 354 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 26 జూన్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

## రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ





హైదరాబాద్: రైతు భరోసాపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల అధికారులతో ఈరోజు(మంగళవారం) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యవసాయ మార్కెటింగ్ చేనేత జౌళి శాఖల అధికారులతో వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు మరియు తదితరులు హాజరయ్యారు. వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు చర్చించారు. అనంతరం మీడియాతో ఈ సమీక్షలో చర్చించిన విషయాలను మీడియాకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రజాభిప్రాయ సేకరణ చేద్దామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో నిలిపివేసిన వ్యవసాయ పథకాలు ఏంటి.. అందుకు గల కారణాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంటల భీమాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు. రాబోయే సీజన్‌కు పంటల భీమాకు సంబంధించి పిలవాల్సిన టెండర్లపై చర్చించారు. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల్లో ఉన్న వ్యవసాయ కళాశాలలు, ఇప్పటికీ కళాశాలలు లేని జిల్లాల వివరాలను డిప్యూటీ సీఎం సమావేశంలో తీసుకున్నారు. సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యకలాపాలపై ఆరా తీశారు. వ్యవసాయ కళాశాలలో విత్తన అభివృద్ధి తీరుపై చర్చించారు. రైతు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నాం.. అయితే

## వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించిన భట్టి

వ్యవసాయం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల పైన దృష్టి సారించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.

వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే ఉత్పత్తుల పెరిగి రాష్ట్ర ఖజానాకు , రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రాష్ట్ర ఖజానాకు అత్యధిక ఆదాయం సమకూర్చే రంగాలు.. ప్రభుత్వం తదితర రంగాలపై చేస్తున్న ఖర్చులను డిప్యూటీ సీఎం అధికారుల ద్వారా విచారించారు. ఇక రైతు భరోసాకు సంబంధించి రైతుల అభిప్రాయం ఎలా ఉంది, ఏ విధంగా ముందుకు పోతే మంచిదనే విషయాలను రైతుల ద్వారానే తెలుసుకుంటే మంచిదని .. రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయ సేకరణ చేసి రైతులను భాగస్వాములను చేయాలని, అందులో మంత్రులు కూడా పాల్గొంటే కార్యక్రమం మరింత ప్రయోజనాత్మకంగా ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్‌కు నిధులు కేటాయిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు అభిప్రాయం వ్యక్తపరిచారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా పథకాలకు ఇప్పటివరకు చేస్తున్న ఖర్చు, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రాబోయే రోజుల్లో పెరుగుతున్న బడ్జెట్‌పై సమీక్ష చేశారు. ఆయిల్ ఫామ్ సాగులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలపై చర్చించారు. రాష్ట్రంలో అమల్లో ఉన్న నేతన్న చేయూత, నేతన్న భీమా పథకాలు ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర విభజన తర్వాత చేనేత కార్మికుల జీవితాల్లో వచ్చిన మార్పులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను విచారించారు. సిరిసిల్ల కో-ఆపరేటివ్ సొసైటీ, టెక్స్‌టైల్ వ్యాపారస్తులు ప్రభుత్వం నుంచి ఏ పద్ధతిలో ప్రయోజనం పొందుతున్నారు తదితర వివరాలను అధికారులు సమావేశంలో వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో మ్యాచింగ్ ద్వారా వచ్చే పథకాలు, నిధులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు, ఆర్థిక శాఖ అడిషనల్ సెక్రెటరీ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




## కొందరు పార్టీ మారినంత మాత్రాన నష్టం లేదు

హైదరాబాద్: కొందరు నేతలు పార్టీ మారినంత మాత్రాన భారాసకు ఎలాంటి నష్టం లేదని మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో పలువురు పార్టీ నేతలతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భారాసలో జరుగుతున్న పరిణామాలు, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ గూటికి చేరిన అంశాన్ని కేసీఆర్ ప్రస్తావించారు. అలాంటి వారు పార్టీ మారడాన్ని పట్టించుకోవద్దని సూచించారు. వైఎస్ హయాంలో ఇలాంటివి ఎన్ని జరిగినా భయపడలేదని పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆరోపించారు. భవిష్యత్‌లో గులాబీ పార్టీకి మంచి రోజులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలను తరచూ కలుస్తానని భరోసా ఇచ్చారు.

## అలకబూనిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి

# మంత్రి పదవి ఆఫర్




హైదరాబాద్ : జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంపై అలకబూని.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానంటూ ప్రకటన చేసిన హస్తం పార్టీ సీనియర్ నేత ఎమ్మెల్సీ టీ.జీవన్‌రెడ్డిని బుజ్జగించేందుకు ఏఐసీసీ బంపరాఫర్ ఇచ్చింది. ఏకంగా మంత్రి పదవి ఇస్తామంటూ ఆఫర్ ఇచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ హైకమాండ్ నుంచి జీవన్ రెడ్డికి ఆఫర్ వచ్చినట్టు తెలుస్తోంది. ఈ విషయంపై స్వయంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ఇద్దరూ జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి చర్చలు జరిపారని సమాచారం. ఎమ్మెల్సీ పదవికి జీవన్ రెడ్డి రాజీనామా చేయకుండా ఇరువురు నేతలు మంతనాలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే పార్టీ మంత్రి పదవిని ఆఫర్ చేస్తోంది. ఈ మేరకు ఏఐసీసీ కూడా సుముఖంగా ఉంది. కాగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ కూడా రంగంలోకి దిగారు. ఫోన్ చేసి మాట్లాడారు. రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ వచ్చాక అన్ని విషయాలు మాట్లాడుతామని మున్షీ హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. మరోవైపు అందుబాటులో ఉన్న పార్టీ సీనియర్లు రాజీనామా ఆలోచనను విరమించుకోవాలని జీవన్ రెడ్డిని కోరుతున్నారు. కాగా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చు కోవడంపై జీవన్‌రెడ్డి కినుక వహించిన విషయం తెలిసిందే. తీవ్ర అసంతృప్తికి గురైన ఆయన రాజీనామాకు సిద్ధమయ్యారు. నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్న తనను మాటమాత్రంగానైనా సంప్రదించకుండా తన సొంత నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పార్టీలో చేర్చుకోవడాన్ని ఆయన ఆక్షేపించారు.

ఇది తనను అగౌరవపరిచినట్లేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జగిత్యాల కాంగ్రెస్ నాయకులే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన వందలాది కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు సైతం సోమవారం ఉదయమే జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. రాత్రి వరకూ అక్కడే ఉండి జీవన్‌రెడ్డి ఆవేదనలో పాలుపంచుకున్నారు.




# కుదరని ఏకాభిప్రాయం

## చరిత్రలో తొలిసారిగా స్పీకర్ పదవికి ఎన్నికలు

## ఇరుపక్షాల నుంచి నామినేషన్లు దాఖలు

స్పీకర్ పదవికి చరిత్రలోనే తొలిసారి ఎన్నికలు జరగబోతున్నాయి. అధికార, విపక్ష పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఇరువైపుల నుంచి స్పీకర్ పదవికి అభ్యర్థులు పోటీపడుతున్నారు. దీంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. మంగళవారం పార్లమెంట్ లో ఎన్డీయే కూటమి నేతలు సమావేశం అయ్యారు. స్పీకర్‌గా ఓం బిర్లాను మరోసారి ఎంపిక చేసినట్లు ఎన్డీయే పక్ష నేతలకు బీజేపీ తెలిపింది. దీంతో ఎన్డీయే పక్షాల పార్టీలు ఓం బిర్లా ఎంపికకు మద్దతు తెలిపాయి. దీంతో ఆయన స్పీకర్ పదవికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. రాజస్థాన్ లోని కోటా నుంచి మూడోసారి ఎంపీగా ఓం బిర్లా ఎన్నికయ్యారు. 2019లో తొలిసారిగా లోక్ సభ స్పీకర్ గా ఎన్నికైన ఓంబిర్లా ఎన్నికల ముందు వరకు లోక్ సభ స్పీకర్ గా కొనసాగారు. అయితే, ఎన్డీయే పక్షాలు ఓం బిర్లానే మరోసారి స్పీకర్ పదవికి సరియైన వ్యక్తిగా భావించి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. ఓం బిర్లాకు మద్దతు తెలపాలని ఇండియా కూటమిని అధికార పక్షం నేతలు కోరారు. అయితే, తమకు ఉపసభాపతి అవకాశం ఇస్తే స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యేందుకు సహకరిస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఆయన డిమాండ్ కు అధికార పక్షం నుంచి సానుకూల సంకేతాలు రాకపోవడంతో స్పీకర్ పదవికి పోటీ చేయాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఇండియా కూటమి స్పీకర్ అభ్యర్థిగా కాంగ్రెస్ ఎంపీ కె. సురేశ్ ను ఎంపిక చేశారు. సురేశ్ ఎనిమిదిసార్లు లోక్ సభకు ఎన్నికయ్యారు. స్పీకర్ ఎంపిక విషయంలో ఇరు పక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎన్నిక అనివార్యం కానుంది. నామినేషన్ దాఖలుకు ఇవాళే చివరిరోజు కావడంతో.. ఎన్డీయే పక్షం తరపున ఓం బిర్లా నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ కార్యక్రమంలో జేపీ నడ్డా, అమిత్ షా, బాలశౌరి, కుమార స్వామి, చిరాగ్ పాశ్వాన్ సహా ఎన్డీఏ కూటమి నేతలు పాల్గొన్నారు. ఇండియా కూటమి తరపున రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలతో కలిసి సురేశ్ నామినేషన్ దాఖలు చేశారు. రేపు ఉదయం 11గంటలకు స్పీకర్ ఎన్నికకు పోలింగ్ జరగనుంది. లోక్ సభ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సందర్భంగా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. మల్లిఖార్జున ఖర్గే సీనియర్ నేత.. ఆయనను గౌరవిస్తాం. నిన్నటి నుంచి మూడుసార్లు స్పీకర్ ఎంపికలో ఏకాభిప్రాయం విషయంపై ఆయనతో మాట్లాడానని చెప్పారు. పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఇవాళ ఉదయం రాజ్‌నాథ్ సింగ్ మల్లికార్జున్ ఖర్గే తో స్పీకర్ ఎంపిక విషయంపై చర్చించాలనుకున్నారు.

కానీ, అతను బిజీగా ఉన్నందున వేణుగోపాల్ మాట్లాడతారని చెప్పారు. టీఆర్ బాలు, కేసీ వేణుగోపాల్‌తో మాట్లాడిన తర్వాత లోక్‌సభ డిప్యూటీ స్పీకర్‌గా ఎవరు ఉండాలనేది ముందుగా నిర్ణయించండి, ఆ తర్వాత స్పీకర్ పదవికి మద్దతివ్వాలనేది నిర్ణయిస్తామని సమాధానం వచ్చినట్లు గోయల్ తెలిపారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## జగన్ ఈ పని ఆనాడే చేసి ఉంటే ?

రాజకీయాల్లో అంతా అయిపోయాక చింతించడం అధినేతలకు అలవాటే. అధికారం అన్న మత్తు దిగిపోయాకనే వాస్తవాలు కళ్ళకు కనిపిస్తాయి. అందుకే అన్నారు పెద్దలు. అధికారాంతమున చూడవలే అయ్యగారి సౌభాగ్యముల్ అని. అధికారం అన్నది కళ్ళకు గంతలు వేస్తుంది. ఏమీ కనిపించకుండా చేస్తుంది. అది అందరి విషయంలోనూ అలాగే ఉంటుంది తాజాగా మాజీ ముఖ్యమంత్రి అయిన వైఎస్ జగన్ కూడా అధికారాంతముల తరువాత పులివెందుల బాట పట్టారు. గతంలో జగన్ సీఎం గా పులివెందులకు రాలేదా అంటే చాలా సార్లు వచ్చారు. అదంతా అధికార పర్యటనలుగా సాగిపోయింది. ఆయన చుట్టూ కోటరీ దుర్భేధ్యమైన కోట. ఆ పై విమానాలతో గగన విహారాలు. దాంతో జగన్ వచ్చారు అంటే వచ్చారు. వెళ్లారు అంటే వెళ్లారు అన్నట్లుగానే ఉండేది. సాదా జనానికి ఆయనను కలిసే భాగ్యం లేకుండా పోయేది. ఏపీలో మిగిలిన నియోజకవర్గాల సంగతి వేరు. పులివెందుల వేరు. జగన్ ని గెలిపించిన సొంత గడ్డ. నిజంగా ఇవ్వాలంటే ఒకింత ఎక్కువ అవకాశం అక్కడ ప్రజలకు ఇవ్వాలి. కానీ జగన్ ఆ పనిచేసినట్లుగా ఎక్కడా కనిపించలేదు. దాంతో ఆయన జనాలకు బహు దూరం అయిపోయారు. దాంతో పులివెందుల మెజారిటీ కూడా ఈసారి జగన్ కి తగ్గింది. ఇక అధికారం పోయి తొలిసారి పులివెందుల వచ్చిన జగన్ జనాలతో బాగానే మమేకం అవుతున్నారు. అందరినీ దగ్గరకు తీసుకుంటున్నారు. జనాలతో పులివెందుల క్యాంప్ ఆఫీసు కిటకిటలాడుతోంది. జనాలకు కుర్చీలు వేస్తున్నరు. షామియానాలు వేస్తున్నారు. అందరినీ జగన్ కలిసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదంతా బాగానే ఉంది అని జనాలు తమ సమస్యలు చెప్పుకునేందుకు వస్తున్నారు. ఇక జగన్ కి కడప విమానాశ్రయంలోనే జనాలు స్వాగతం పలికారు. ఆయన కోసం వేలాదిగా జనాలు సిద్ధంగా ఉండడం కూడా కనిపించింది. ఎన్నో ఓదార్పు యాత్రలు చేసిన జగన్ కి జనాలు అలా ఓదార్పు ఇచ్చారు అన్న మాట. ఇలా జగన్ కోసం పులివెందుల జనం అంతా తరలి వచ్చారు. వారిలో వృద్ధులు యువత, మహిళకు అంతా ఉన్నారు. ఇలా జగన్ కోసం వారు వచ్చారు. జగన్ కూడా జనం కోసం వచ్చారు. అంతా బాగానే ఉంది. కానీ ఇదే రకంగా అయిదేళ్ల పాటు సీఎం గా ఉన్న కాలంలో జగన్ జనంతో మమేకం అయి ఉంటే ఎంత బాగుండేది అన్న మాటలు వినిపిస్తున్నాయి. జగన్ తామేసిన ఓటుతో ఎమ్మెల్యే అయ్యారు. సీఎం అయ్యారు. అయినా తమను కలవలేదే అన్న అసంతృప్తి జనంలో బాగా ఉండేది. వైసీపీకి దక్కిన భారీ ఓటమితో మొత్తం సీన్ మారింది. వచ్చిన జనాలను వచ్చినట్లుగా జగన్ వద్దకు పంపిస్తునారు వైసీపీ నేతలు. జగన్ సైతం ఓపిక చేసుకుని అందరితో మాట్లాడుతున్నారు. జగన్ ఇపుడు బాగున్నారు. అందరినీ పలకరిస్తున్నారు. ఇదే రకంగా సీఎంగా ఉన్నపుడు చేసి ఉంటే వైసీపీ ఓడిపోయేది కాదు కదా అని ఆ పార్టీ క్యాడర్ అంటోంది. జరిగినది ఏదో జరిగిపోయింది. జగన్ ఇదే తీరున ఆరు నెలల నుంచి ఏడాది పాటు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో మూడేసి రోజుల పాటు పర్యటిస్తే పార్టీకి ఊపొస్తుంది, జనాలకు జగన్ చేరువ అవుతారు అని అంటున్నారు. అంతే తప్ప ఈ టైం లో మళ్లీ పాదయాత్ర ఓదార్పు యాత్రలు అని నిర్వహించడం వల్ల ఉపయోగం ఏమీ ఉండదని అంటున్నారు. జగన్ జనం వద్దకు వెళ్తే వారే పార్టీ ఓటమికి అసలైన ఫీడ్ బ్యాక్ ని ఇస్తారని దానిని బట్టే పార్టీని పునర్ నిర్మించుకోవచ్చు అని అంటున్నారు. మరి పులివెందుల వచ్చిన జగన్ ఏపీ అంతా తిరుగుతారా అంటే చూడాల్సి ఉంది. కానీ పార్టీ క్యాడర్ ఇదే కోరుతోంది. పార్టీ క్యాడర్ మాట వినడం ఈ టైం లో అధినాయకునికి అతి ముఖ్యమని అంటున్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**మందపల్లి గ్రామంలో బిటి రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే**







**పెంబి జూన్ 25(ప్రభాత సమాచారం )**
గ్రామాల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం పెంబి మండలంలోని మందపల్లి గ్రామంలో బిటి రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ.గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తోందన్నారు.కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల సాధ్యమవుతుందని పేర్కొన్నారు.గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు.ఈ ప్రాంత అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి

**స్టేషన్కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి**

**పెండింగ్ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించాలి**


**జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాసరావు**



**బెజ్జూర్ జూన్ 25 ( ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మంగళవారం కాగజ్నగర్ సబ్ డివిజన్లోని కౌటాల సర్కిల్ పరిధి లోగల సిర్పూర్ టి, కౌటాల, చింతలమానపల్లి, బెజ్జూరు పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసరాలను, రిసెప్షన్, స్టేషన్ రైటర్, ఎస్ హెచ్ వో,రెస్ట్ రూమ్ , లాక్ అప్ రూమ్ ను పరిశీలించారు. 5%S% అమలు తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా పూర్వకంగా నడుచుకోవాలని తెలియజేశారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24 గంటలు గస్తీ నిర్వహించాలని , సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలతోపాటు యువతను అప్రమత్తం చేయాలని సూచించారు. సిబ్బంది యొక్క సమస్యలు అడిగి తెల్సుకుని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాగజ్నాగర్ డీఎస్పీ కరుణాకర్,కౌటల సిఐ సాదిక్ పాషా, ఎస్ బి సి ఐ రాణా ప్రతాప్ , ఎస్ఐ విక్రమ్ రమేష్ నరేష్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం, నాగోబా టెంపుల్ ఆధునీకరణ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





**ఉట్నూర్ జూన్ 25(ప్రభాత సమాచారం)**
ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం, కెస్లాపూర్ నాగోబా దేవాలయం ఆధునికరణ నిర్మాణం పనులు త్వరగా ప్రారంభించి మూడు నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఛాంబర్ లోఐటిడిఏ పిఓ ఖుష్బూ గుప్తా తో కలసి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమరవీరుల స్థూపం, కెస్లాపూర్ నాగోబా దేవాలయం ఆధునికరణ నిర్మాణం పనులకు రెండు కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. స్థూపం వద్ద కాంపౌండ్ వాల్, బోర్ వెల్, పంప్ సెట్, స్ట్రీట్ లైట్స్, షెడ్స్, స్తూపం చుట్టూ స్టెప్స్, తదితర నిర్మాణ పనులు అలాగే నాగోబా దేవాలయ నిర్మాణ పనుల్లో కమ్యూనిటీ హాల్, టాయిలెట్స్ , బోర్ వెల్, పంప్ సెట్స్, స్టెప్స్, విద్యుత్ దీపాలు, తదితర పనులు సెప్టెంబర్ 30 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీటికి సంబందించి అగ్రిమెంట్ జరిగి 15 రోజులు గడుస్తున్న ఇంకా పనులు ఎందుకు ప్రారంభించలేదన్నారు.ఎక్కువ మంది లేబర్లతో త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్టర్ ని ఆదేశించారు.ఉట్నూర్ మండల పరిధిలోని అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ ద్వార చేపడుతున్న నిర్మాణ పనులు, అడిషనల్ క్లాస్ రూమ్ లు, ఏకరూప దుస్తులు, ఐటిడిఎ ద్వార మేజర్ వర్క్స్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో లైన్ డిపార్ట్మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను కలసిన ఎమ్మెల్యే

**హరీత రిసార్ట్ ను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**



**నిర్మల్ జూన్ 25(ప్రభాత సమాచారం)** జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్ ను ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజే శారు. ఖానాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి అభివృద్ధిపై చర్చించారు. కడెం మండల కేంద్రంలో ప్రభుత్వ టూరిజం భూమితో పాటు హరిత రిసార్ట్ ను కొందరు కబ్జా చేశారాని కలెక్టర్ దృష్టికి కెళ్లి కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.వారి వెంట ఖానాపూర్,కడెం మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## బిటి రోడ్ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే





**కడెం జూన్ 25(ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని నవాబ్ పేట్, చిట్యాల, సారంగాపూర్, ధర్మాజీపేట్ గ్రామాలలో బీటి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.అనంతరం కడెం ప్రాజెక్టును సందర్శించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కడెం ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందజేస్తామన్నారు.గత ప్రభుత్వం కడెం ప్రాజెక్టును పట్టించుకోకపోవడం వల్లే ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి తొమ్మిది కోట్ల 21 లక్షల నిధులను మంజూరు చేసి కడెం ప్రాజెక్టు కు పూర్తిస్థాయి మరమ్మత్తులు చేయించిందన్నారు.గ్రామాల అభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.పేదల సంక్షేమానికి పెద్దపీటా వేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

## దేవుడి వద్ద ప్రమాణాలకు దారితీసిన 'బూడిద పంచాయితీ' సవాళ్లు, ప్రతిసవాళ్లతో హుజూరాబాద్‌లో ఉద్రిక్తత

**వీణవంక జూన్ 25(ప్రభాత సమాచారం)**
నిబంధనలకు విరుద్ధంగా రవాణా అవుతున్న బూడిద పంచాయితీ కాస్తా దేవుని వద్ద ప్రమాణాలకు దారి తీయడం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గంలో ఉద్రిక్తతకు దారితీసింది. ఎన్టీపీసీ బూడిద రవాణాపై రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. బూడిద రవాణాలో మంత్రి పొన్నం ప్రభాకర్ ముడుపులు తీసుకున్నారని ఆరోపించిన కౌశిక్‌రెడ్డి ఏకంగా లారీలను అడ్డుకున్నారు. ఆ వ్యవహారంపై ఆగ్రహించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ దినపత్రికతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి లీగల్ నోటీసులు పంపించారు.పొన్నం నోటీసులపై స్పందించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అవినీతి చేయకపోతే జూబ్లీహిల్స్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో



ప్రమాణం చేయాలని మంత్రి పొన్నంకి సవాల్ విసిరారు. ఆ సవాల్‌కి హుజురాబాద్ కాంగ్రెస్ ఇంఛార్జి వొడితెల ప్రణవ్ ఎదురు దాడికి దిగారు. కౌశిక్‌రెడ్డి ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేశారని తన వ్యాఖ్యలు తప్పయితే హుజురాబాద్ నియోజకవర్గంలోని చెల్పూర్ ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చి తడిబట్టలతో ప్రమాణం చేయాలని ప్రతిసవాల్ విసిరారు. ఆ సవాల్ స్వీకరించిన కౌశిక్‌రెడ్డి చెల్పూరుకి వస్తానని ప్రకటించారు.

**చెల్పూర్ హనుమాన్ ఆలయం ఉద్రిక్తత**

శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. చెల్పూర్ హనుమాన్ ఆలయం వద్ద ఫ్లెక్సీలు తొలగించారు. హైదరాబాద్ నుంచి వీణవంక చేరుకున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్‌లను అడ్డుకుని గృహ నిర్బంధం చేశారు. ఇరుపార్టీల నాయకులు చెల్పూర్ వెళ్లకుండా పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. కొందరు చెల్పూర్ హనుమాన్ ఆలయం వద్దకు రాగా పోలీసులు వారిని అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు.

**నేతల సవాళ్లు- ప్రతిసవాళ్లతో హుజురాబాద్ నియోజకవర్గంలో ఉద్రిక్తత**

కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానంటూ కౌశిక్‌రెడ్డి రూ.20 లక్షలు తీసుకొని మోసం చేశాడంటూ ఓ బాధితుడు తడిబట్టలతో ప్రమాణం చేశారు. దీంతో హనుమాన్ ఆలయం వద్ద కాస్త ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రభుత్వంపై కౌశిక్‌రెడ్డి అనవసర ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు స్వల్ప లాఠీఛార్జీ చేశారు.

చెల్పూర్ ఆలయానికి వస్తుండగా పోలీసులు వీణవంకలో గృహనిర్బంధం చేయటంతో తను ఎలాంటి అవినీతికి పాల్పడలేదంటూ కౌశిక్ రెడ్డి అక్కడే ప్రమాణం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం అపోలో వెంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చి నిజాయితీని నిరూపించుకోవాలని మరోసారి సవాల్ విసిరారు. ఆలయానికి వచ్చి ప్రమాణం చేయకపోతే అవినీతి చేసినట్లు పొన్నం ఒప్పుకున్నట్లేనని కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

బూడిద రవాణా విషయంలో ఆరోపణలు చేయటం కాదని ఆధారాలుంటే చూపెట్టాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ప్రణవ్ హెచ్చరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

# ప్రైవేటులో పుస్తకాల పేరిట దోపిడీ



కోదాడ : అనంతగిరి మండలానికి చెందిన ఓ రైతు తన కుమారుడిని పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నారు. ఏడో తరగతి చదువుతున్న ఆ విద్యార్థికి పుస్తకాల పేరిట రూ.10 వేలు వసూలు చేశారు. బయట మార్కెట్‌లో ఆ పుస్తకాలకు రూ.3 వేలకు మించి కావని సదరు విద్యార్థి తండ్రి వాపోయాడు. పుస్తకాలకు సంబంధించిన బిల్లును కూడా పాఠశాల యాజమాన్యం ఇవ్వడం కొసమెరుపు. ఇదే పాఠశాలలో 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు ఐఐటీ పేరు మీద రూ.20 వేల వరకు కేవలం పుస్తకాల మీదే వసూలు చేస్తున్నారంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

కోదాడ పట్టణంలో ఎల్‌కేజీ చదువుతున్న ఓ విద్యార్థికి రూ.2,500 పుస్తకాల పేరిట డబ్బులు వసూలు చేయడం గమనార్హం. పుస్తకాలకు ఇంత ధర ఏంటనీ సదరు విద్యార్థి తండ్రి పాఠశాల నిర్వాహకులను ప్రశ్నించగా వేరే పాఠశాలలో రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారని, వారితో పోల్చుకుంటే తక్కువేనని బదులిచ్చారు.

ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల పేరిట నిర్వాహకులు అధిక వసూళ్లకు పాల్పడుతున్నారు. క్షేత్రస్థాయిలో లభించే ధరలకు పదింతలు ధరలు పెంచి అదే పాఠశాలలో పుస్తకాలు కొనుగోలు చేయాలనే నిబంధన పెట్టి విక్రయిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు విక్రయించొద్దని ప్రభుత్వం ఆదేశించింది. ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూ కొందరు అడ్డగోలుగా పుస్తకాల పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారు.

రహస్య స్థలంలో నిల్వచేసి విక్రయం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,100కు పైగా ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో 5 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించకుండా సమీపంలోని రహస్య స్థలంలో పుస్తకాలు డంప్ చేసి విక్రయిస్తున్నారు. పుస్తకాల పేరిట ఒక్కో విద్యార్థి మీద అదనంగా రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేసినా రూ.10 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లే. భారీ స్థాయిలో పుస్తకాలు విక్రయిస్తున్నా అధికారులు ఒక్క పాఠశాలను కూడా తనిఖీ చేసి పట్టుకోకపోవడం గమనార్హం.

తనిఖీలు నిర్వహించి చర్యలు చేపడతాం

ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించొద్దని ఆదేశాలు జారీ చేశాం. కొందరు పుస్తకాలు విక్రయించడమే కాకుండా అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా మా దృష్టికి తీసుకురండి.

అశోక్, జిల్లా విద్యాధికారి, సూర్యాపేట

# చెరువులకు సొబగులు

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ పరిధిలోని చెరువులు కొత్తరూపు సంతరించుకోనున్నాయి. విడతల వారీగా అభివృద్ధి చేసేందుకు హెచ్ఎండీఏ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇది వరకే 15 చెరువులను ఎంపిక చేసి కొన్ని పనులు చేపట్టింది. తాజాగా ఏడు జిల్లాల పరిధిలో మరో 45 చెరువులను అభివృద్ధి చేసేందుకు తాజాగా నిర్ణయం తీసుకుంది. హెచ్ఎండీఏ పరిధిలోని అనేక చెరువు ఆక్రమణలు...కలుషిత జలాలు...పూడికతో నిండిపోయాయి. బల్దియా వరకు 160 వరకు చెరువులుంటే దాదాపుగా అన్నింటివీ ఇదే పరిస్థితి. ఈ పరిస్థితిపై ఇటీవల హైకోర్టు కూడా ఆందోళన వ్యక్తం చేసింది. వెంటనే పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇందులో భాగంగా హెచ్ఎండీఏ పరిధిలోని తొలి విడతలో కొన్ని చెరువుల పునరుద్ధరణకు హెచ్ఎండీఏ పూనుకుంది. ఇందుకోసం రూ.22 కోట్ల వరకు వెచ్చించనుంది.

ఏం చేస్తారంటే... హెచ్ఎండీఏ విస్తరించి ఉన్న ఏడు జిల్లాల పరిధిలో 3532 చెరువులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 3 వేల చెరువులకు ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్)ను నిర్ధారించారు. చాలాచోట్ల ఎఫ్‌టీఎల్ పూర్తిగా ఆక్రమణలకు గురైంది. పునరుద్ధరణలో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధి వరకు మార్కింగ్ ఇస్తారు. అక్రమ నిర్మాణాలుంటే కూల్చేస్తారు.



భవిష్యత్తులో అక్కడ కట్టడాలు లేకుండా చర్యలు తీసుకుంటారు. లేఅవుట్లు రాకుండా హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేస్తారు.

సుందరీకరణలో భాగంగా చెరువుల కట్టలను బలోపేతం చేసి... లోనికి నీళ్లు వచ్చే కాల్వలను శుభ్రం చేయనున్నారు. చెరువుపై వాకింగ్ ట్రాక్‌లు, పూలు, ఆర్నమెంట్ మొక్కలు పెంచి చుట్టూ గార్డెనింగ్ అభివృద్ధి చేస్తారు. స్థలం ఉంటే అక్కడ పార్కులను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో స్థానికులను కూడా భాగస్వామం చేయనున్నారు. ఫలితంగా పట్టణాలు, కాలనీలకు చెరువులకు మధ్య కంచె నిర్మించి లోపల అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చూస్తారు. పట్టణాలు, గ్రామాలకు, రహదారులకు పక్కన చెరువులు ఆక్రమణలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉండటంతో తొలుత అక్కడ చర్యలు చేపడతారు.

# సరిహద్దు సమస్యలు పరిష్కరించుకుందాం..!

హైదరాబాద్: హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ భూములు, రక్షణశాఖ భూముల సరిహద్దుల నిర్ణయంలో ఉత్పన్నమవుతున్న వివాదాలను పరిష్కరించుకునేందుకు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చొరవ తీసుకున్నారు. రక్షణ శాఖ అధికారులు, బ్రిగేడియర్ సోమశంకర్ ఎస్.ఎంలతో కలిసి కంటోన్మెంట్ కార్యాలయంలోని సమావేశ భవనంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో వీటిని పరిశీలించి సరిహద్దులు నిర్ణయించేందుకు రెవెన్యూ, రక్షణ శాఖ అధికారులు కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహిద్దామని ప్రతిపాదించారు. గోల్కొండ, ఆసిఫ్‌నగర్ మండలాల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలు అక్కడి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నారు. క్రమంగా ఇళ్లు కట్టుకున్నారు. వీటిని క్రమబద్ధీకరించాలంటూ నాలుగు వందల



కుటుంబాలకు పైగా రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులపై ప్రత్యేకంగా రక్షణశాఖ అధికారులతో అనుదీప్ దురిశెట్టి చర్చించారు.

ఆరు అంశాలపైనే చర్చ...

కంటోన్మెంట్, తిరుమలగిరి, ఆసిఫ్‌నగర్, కంచన్‌బాగ్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములు, ఆక్రమించుకున్న స్థలాలపై సమాచారాన్ని సేకరించిన అధికారులు వాటిని ఆరు అంశాలుగా రూపొందించి చర్చించారు. రక్షణశాఖకు చెందిన భూములను ఎవరైనా ఆక్రమించుకుంటే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా రక్షణశాఖ అధికారులకు రెవెన్యూ అధికారులు సహకరించనున్నారు. సైనిక స్కూల్‌కు కేటాయించిన భూములను రెవెన్యూ అధికారులు రక్షణశాఖకు అప్పగించేందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయనున్నారు.

# చుట్టూ శునకాలు.. అరచేతిలో ప్రాణాలు

హైదరాబాద్: సుమారు పది శునకాలు ఓ మహిళపై దాడి చేశాయి. అటుగా ద్విచక్రవాహనంపై వచ్చిన మరో వ్యక్తి సాయం చేయడంతో బతికి బయటపడింది. బాధితురాలి వివరాల ప్రకారం.. మణికొండ చిత్రపురికాలనీకి చెందిన రాజేశ్వరి ఉదయం వాకింగ్‌కు బయల్దేరగా వీధి కుక్కలు వెంటపడ్డాయి. ఆమె చేతిలోని ఫోన్‌ను ఆహారంగా భావించి దాడిచేయడానికి ప్రయత్నించాయి. ఈ క్రమంలో రాజేశ్వరి పలుమార్లు కిందపడి లేచారు. ఎన్నిసార్లు వాటిని వెళ్లగొట్టే ప్రయత్నం చేసినా వదలకుండా ఆమెను వెంబడించాయి. ఈ ఘటనలో ఆమె స్వల్పంగా గాయపడ్డారు. చివరికి అదే సమయంలో ఓ ద్విచక్ర వాహనదారుడు రావడంతో శునకాలు పారిపోయాయి. దీంతో ఆమె ఊపిరిపీల్చుకున్నారు. ప్రాణభయంతో ఆమె చేసిన ప్రయత్నం సీసీ కెమెరాల్లో రికార్డైంది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొట్టింది. ప్రాణాలతో బయటపడుతానని అనుకోలేదు

కుక్కలు ఇలా దాడి చేస్తాయని అనుకోలేదు. చేతిలో ఉన్న ఫోన్‌తోనే వాటిని కొడుతూ రక్షించుకోగలిగాను. దేవుడి దయవల్ల బతికి బయటపడ్డాను. చేతిపై ఒక్క చోట కుక్క కరిచింది. కింద పడినందున స్వల్పంగా గాయాలయ్యాయి. రోడ్డుపైకి వచ్చాక ఒకరు బైకుపై, కారులో మరొకరు రావడంతో కుక్కలు వెనుదిరిగాయి. రాజేశ్వరి

కుక్కల బెడద ఉంటే సమాచారం ఇవ్వండికుక్కల బెడద ఉందని తెలిస్తే వెంటనే వాటిని అరికట్టడానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నాం. చిత్రపురికాలనీలో జరిగిన కుక్కల దాడి విషయం తెలియగానే బ్లూక్రాస్ సంస్థను అప్రమత్తం చేశాం. మణికొండ మున్సిపల్ పరిధిలో ఎక్కడైనా కుక్కల బెడద ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి. – ప్రదీప్‌కుమార్, మణికొండ మున్సిపల్ కమిషనర్

# నాణ్యమైన విత్తనం.. విక్రయానికి సిద్ధం!



మిర్యాలగూడ : ఏ రకమైన పంటలు సాగుచేయాలన్నా.. రైతులు తొలుత ఆలోచించేది విత్తనాల గురించే. విత్తనాలు నాణ్యతతో ఉండడంతో పాటు తక్కువ సాగు సమయం, అధిక దిగుబడి.. మార్కెట్‌లో మంచి ధర పలికే విధంగా జాగ్రత్తలు పడుతారు. బయట ప్రైవేట్ దుకాణాల్లో వారు చెప్పింది విని విత్తనాలు తీసుకుని రైతులు నష్టపోయిన ఘటనలు ఉమ్మడి జిల్లాలో తరచూ జరుగుతూనే ఉంటాయి. ఉమ్మడి జిల్లాలో అధికంగా వరి పంటలే సాగు చేస్తారు. ఈ నేపథ్యంలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు చర్యలు చేపడుతోంది.

రెండు ల్యాబుల్లో పరీక్షలు..

మిర్యాలగూడలోని నందిపాడులో విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్(ఉమ్మడి జిల్లా) ప్రధాన కార్యాలయంతో పాటు గోదాములు, 130 ఎకరాల సాగు భూమి ఉన్నాయి. దీని పరిధిలో సూర్యాపేట, నిడమనూరులో చిన్న గోదాములు ఉన్నాయి. శాస్త్రవేత్తలు సూచించిన విత్తనాలను ఇక్కడి అధికారులు తమ సాగు భూమితో పాటు పలువురు ఎంపిక చేసిన రైతులకు అందించి.. సాగులో సలహాలు ఇస్తూ.. పంట నాణ్యతతో వచ్చే విధంగా చర్యలు చేపట్టి.. ఆ ధాన్యాన్ని కనీస మద్దతు ధర కంటే పది శాతం అదనంగా చెల్లించి కొనుగోలు చేస్తారు. ఆ ధాన్యంలో ఎటువంటి బెరుకులు, ఇతర రకం ధాన్యం గింజలు లేకుండా వేరు చేసి హైదరాబాద్‌లోని రెండు ల్యాబుల్లో పరీక్షిస్తారు. అక్కడ అనుమతి పొందిన వాటిని 25 కిలోల చొప్పున సంచుల్లో నింపి.. ప్రత్యేక ట్యాగ్, హోలోగ్రామ్ అంటిస్తారు. ఇవి విత్తనాల నాణ్యతకు సూచికలుగా పరిగణిస్తారు. ఈ విత్తనాలు ప్యాకింగ్ తేదీ నుంచి 9 నెలల పాటు సాగుకు వినియోగిస్తారు. అనంతరం వేలంపాట ద్వారా విక్రయిస్తారు.

సంస్థ సూచించిన ధరకే..

విత్తనాభివృద్ధి సంస్థ తయారు చేసే విత్తనాలను రైతులకు విక్రయించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్, డీసీఎంఎస్, రైతు సంఘాలతో పాటు లైసెన్స్ పొందిన డీలర్లను నియమించారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం వంద మంది డీలర్లు ఉన్నారు. వీరి వద్ద సంస్థ సూచించిన ధరకే విత్తనాలు కొనుగోలు చేయవచ్చు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు సంబంధించి సంస్థ వద్ద 8 రకాల వరి విత్తనాలు, మినుములు, కందులతో పాటు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు, జనుము, పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. పచ్చిరొట్ట విత్తనాలకు ప్రభుత్వం రాయితీ సైతం అందిస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి: సీహెచ్.కృష్ణవేణి, రీజినల్ మేనేజర్, విత్తనాభివృద్ధి సంస్థ, మిర్యాలగూడ

సంస్థల్లో కేఎన్ఎం-1638 వంటి సన్నరకం వరి విత్తనాలు సైతం ఉన్నాయి. వీటి సాగు సమయం కేవలం 120 రోజులు మాత్రమే. వీటితో పాటు పలు రకాల దొడ్డు రకం విత్తనాలు సైతం అందుబాటులో ఉన్నాయి. సంస్థ ద్వారా గతేడాది సుమారు 15వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలు విక్రయించాం. ఈ ఏడాది ఇప్పటికే 5 వేల క్వింటాళ్లు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# అద్దెకు ఎద్దులు..!

మర్రిగూడ : వానాకాలం ప్రారంభం అవ్వడంతో వ్యవసాయ పనుల సీజన్ మొదలైంది. దీంతో రైతులు తమ పనుల్లో మునిగిపోయారు. చాలా మంది రైతులు భూమిని చదును చేసి ఇప్పటికే విత్తనాలు వేయగా, మరికొందరు దుక్కులు దున్నుతూ విత్తడం కోసం సిద్ధం చేసుకుంటున్నారు. యాంత్రీకరణ పెరిగిన నేపథ్యంలో కొంత కాలంగా దుక్కులు దున్నడం, వ్యవసాయ భూములు చదును చేయడం మొదలగు పనులు అన్నీ ట్రాక్టర్ల సహాయంతో చేస్తూ ముందుకు సాగుతున్నారు. నల్గొండ జిల్లాలో చాలా వరకు రైతులు ప్రధానంగా పత్తిని పండిస్తారు. ఈ విత్తనాలను విత్తడం, వరుసలు వేయడం, పంటలో కలుపు తీయడానికి గుంటుక కొడుతుంటారు. వీటి కోసం ఎద్దుల అవసరం తప్పని సరిగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎద్దుల పోషణకు అయ్యే ఖర్చు, వాటిని చూసుకోవడానికి ప్రత్యేకంగా ఓ మనిషిని కేటాయించాల్సిన అవసరం ఉండటంతో చాలా మంది కిరాయికి ఎద్దుల అరకను తీసుకోని వ్యవసాయం కొనసాగిస్తున్నారు. చాలా మంది వ్యవసాయ దారులు అరకలను అద్దెకి వినియోగించే పరిస్థితులు ఏర్పడటంతో కాడెడ్లకి బాగా గిరాకీ ఏర్పడింది. కొందరు ఎద్దులు ఉన్న పెద్ద రైతులు వాటిని కిరాయికి ఇచ్చి, వచ్చిన డబ్బుల ద్వారా వాటి పోషణ ఖర్చులను వెల్లదీసుకుంటున్నారు.

కిరాయికి ఇచ్చి జీవనం...

గ్రామాల్లో రెండు మూడు జతల ఎద్దులు ఉన్న రైతులు వాటిని కిరాయికి



ఇచ్చి జీవనం సాగిస్తున్నారు. మరి కొందరు తమకున్న కొద్దిపాటి వ్యవసాయాన్ని సాగు చేసుకుంటున్నారు. మిగతా రోజుల్లో చిన్న సన్నకారు రైతులకు కిరాయిలకి ఇస్తూ వాటి పోషణ ఖర్చులు వెల్లదీస్తున్నారు. అరక సామగ్రితో పాటు ఎడ్లు, మనిషి కిరాయికి వెళ్తే రోజుకు సుమారు రూ.2 వేల వరకు కిరాయి లభిస్తుంది. మనిషి లేకుండా అయితే రూ.1500 వరకు అద్దె చెల్లిస్తున్నారు.

రోజుకు రూ. 2వేలు చెల్లించాను

నాకున్న ఐదు ఎకరాల్లో పత్తిని సాగు చేశాను. ఎద్దుల జతలు లేకపోవడంతో వేసవిలో ట్రాక్టర్‌తో భూమిని దుక్కి దున్ని చదును చేసి విత్తనాలు వేయడం కోసం సిద్ధం చేశా. ఎద్దులను కొనుగోలు చేసి పోషించే ఆర్థిక స్థోమత లేదు. గత కొన్ని రోజుల కిందట అరకను మనిషితో పాటు రోజుకు రూ.2 వేలకు అద్దెకు తీసుకొని విత్తనాలు వేశాను. బండ అంజయ్య, రైతు, మర్రిగూడ

# ఇక రయ్ రయ్

నిజామాబాద్ :జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా నిజామాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగ్దల్‌పూర్ వరకు ఉన్న జాతీయ రహదారి 63 విస్తరణ పనులు ఇక వేగాన్ని అందుకోనున్నాయి. మోదీ 3.0 వంద రోజుల ప్రణాళికలో దేశవ్యాప్తంగా మూడు వేల కిలోమీటర్ల రహదారులకు మోక్షం కలగనుండగా అందులో మన రాష్ట్రానికి చెందిన ఆర్మూర్– క్యాతనపల్లి యాక్సెస్ కంట్రోల్ ప్రాజెక్టు, జగిత్యాల–కరీంనగర్ నాలుగు వరుసల రహదారులు కూడా ఉండటం విశేషం. నిజామాబాద్– జగ్దల్‌పూర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మించే ఈ రహదారి జిల్లాలో దండేపల్లి మండలం గూడెంలో ప్రారంభమై క్యాతనపల్లి వరకు కొనసాగనుంది. ఆర్మూర్– క్యాతనపల్లి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఇప్పటికే సర్వే పూర్తి కాగా భూసేకరణ పనులు పూర్తి కావొస్తున్నాయి. తాజాగా కేంద్రం యుద్ధ ప్రాతిపదికన చేపట్టే ప్రాజెక్టుల్లో ఈ రహదారికి కూడా చోటు దక్కడంతో జాతీయ రహదారికి రాజయోగం పట్టనుంది.

మెరుగుపడనున్న రవాణా వ్యవస్థ

దశాబ్దాలుగా రహదారి విస్తరణ ప్రతిపాదనలు జరుగుతున్నా ఇప్పటివరకు అవి ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం అధికారులు ప్రతిపాదిస్తున్న విధానంలో మంచిర్యాల జిల్లాలో గూడెం గోదావరి తీరం నుంచి క్యాతనపల్లి వరకు పొలాల గుండా వెళ్లనుండటంతో నిర్మాణ వ్యయం తక్కువగా ఉండటంతో పాటు అభ్యంతరాలకు పెద్దగా అవకాశం ఉండదు. దీంతో పనులు వేగంగా జరిగేందుకు అవకాశాలు ఉన్నాయి. రహదారి నిర్మాణ పనులు పూర్తయితే నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లా వాసులకు రవాణా సౌకర్యాలు మెరుగయ్యే అవకాశాలు ఉన్నాయి.

రహదారుల అనుసంధానం

నిజామాబాద్ – జగ్దల్‌పూర్ జాతీయ రహదారిలో భాగంగా నిర్మించే ఈ రహదారి ప్రస్తుతం ఆర్మూర్ నుంచి మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి వరకు 131.8 కిలోమీటర్లు ఉంటుంది. దీని కోసం రూ. 3850 కోట్లు వెచ్చించనున్నారు. ఇక జిల్లాలోని గూడెం నుంచి క్యాతనపల్లి వరకు 35 కిలోమీటర్లు రహదారి నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉంది. అవసరం ఉన్న ప్రాంతాల్లో బైపాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, అండర్ పాస్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇక మంచిర్యాల వద్ద 63 నెంబర్ జాతీయ రహదారి నాగ్‌పూర్–విజయవాడ 363 జాతీయ రహదారితో అనుసంధానం కానుంది.

అభ్యంతరాల నడుమ అటకెక్కిన గ్రీన్‌ఫీల్డ్ హైవే

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి జగ్దల్‌పూర్ వరకు ఉన్న 63వ నెంబర్ జాతీయ రహదారిని గ్రీన్ ఫీల్డ్ అలైన్‌మెంట్‌గా గుర్తించిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు రహదారి నిర్మాణం చేపట్టేందుకు వీలుగా పలుమార్లు సర్వే నిర్వహించారు. పలు మార్గాల్లో రహదారి నిర్మాణంపై డీపీఆర్ రూపొందించారు. గ్రీన్ ఫీల్డ్ నిర్మాణంతో తమ విలువైన భూములు కోల్పోవాల్సి వస్తుందని భూ యజమానులు, రైతుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తడం, ఆధ్యాత్మిక ప్రదేశాలు దెబ్బతింటాయని పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. మరోవైపు గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం మలుపులు తిరుగుతూ గ్రామాలు, వాగు, వంకలు తాకుతూ వెళ్లాల్సి రావడంతో నిర్మాణ వ్యయం కూడా అంచనాలకు మించినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న రహదారినే యాక్సెస్ కంట్రోల్ ప్రాజెక్టుగా విస్తరించాలని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తోంది.

# ఆశల వల.. చిక్కితే విలవిల

నిజామాబాద్ : చరవాణితో ప్రపంచ పరిజ్ఞానాన్ని తెలుసుకునే అవకాశం ఉంది. దీన్ని తెలివిగా వాడుకోవాలి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉండి.. వచ్చే లింక్‌లను క్లిక్ చేస్తే.. మన చరవాణులు మోసగాళ్ల అదుపులోకి వెళ్లిపోతాయి. మన విలువైన సమాచారాన్ని ఉపయోగించుకుని నేరాలకు పాల్పడే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఇటీవల సైబర్ మోసాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తక్కువ డబ్బులకు పలు వస్తువులు వస్తున్నాయని, తమ ఆధార్, పాన్‌కార్డ్ అప్‌డేట్ చేసుకోవాలని, రైతుబంధు, పీఎం కిసాన్ డబ్బులు వచ్చాయని లింక్‌లు పంపిస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. ఈ ఆశల వలలో చిక్కి అనేక మంది కష్టాలు కొని తెచ్చుకుంటున్నారు. బోథ్ మండలంలో ఇటీవల ఆధార్ అప్‌డేట్ చేయాలని బాధితుడి చరవాణికి ఓ సందేశం వచ్చింది. అది క్లిక్ చేసిన గంట తర్వాత తన బ్యాంకు ఖాతా నుంచి రూ.45 వేలు విత్‌డ్రా అయినట్లు మరో సందేశం వచ్చింది. అది చూసిన బాధితుడు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాడు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

సిరికొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకులకు ఓ వాట్సప్ గ్రూపులో కిసాన్ యాప్ పేరుతో సందేశం వచ్చింది. సంబంధిత లింక్‌పై క్లిక్ చేయడంతో తమ వాట్సప్ హ్యాక్ అయింది. ఒక్కసారిగా కంగుతిన్న యువకులు అయోమయంలో పడ్డారు. తమ వాట్సప్ నుంచి హ్యాకర్లు ఇతరులకు సందేశాలు పంపించి డబ్బులు అడిగే పరిస్థితి చోటు చేసుకుంది.

ఇటీవల తక్కువ ధరకే ట్రాక్టర్ ఉందని ఫేస్‌బుక్‌లో సందేశంరాగా.. ఉట్నూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి రూ.60 వేలు అతడు ఇచ్చిన అకౌంట్‌కు పంపారు. తిరిగి ఇంకా పంపాలని సూచించడంతో అనుమానం వచ్చి పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. దీంతో మోసానికి గురయ్యానని తెలుసుకుని లబోదిబోమన్నారు.

శ్రీ ఉట్నూరులో ఓ వ్యక్తికి సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ ఇటీవల హ్యాక్ అయింది. దీని నుంచి అత్యవసరంగా డబ్బులు కావాలంటూ మిత్రులకు సందేశాలు వచ్చాయి.. దీంతో పలువురు డబ్బులు పంపారు. అయినా పదే పదే సందేశాలు రావడంతో అనుమానం వచ్చి సంబంధిత వ్యక్తిని కనుక్కోగా తాను పంపలేదని సూచించారు. దీంతో వీరు పోలీస్‌స్టేషన్‌తోపాటు బ్యాంకును సంప్రదించారు.

ఇలా చేయాలిఏదైనా బ్యాంకు లేదా సంస్థ ఓటీపీలు, ఇతర వివరాలను అడిగితే వెంటనే సంబంధితశాఖను నేరుగా కలవాలి. సంబంధిత వివరాలను అడిగి తెలుసుకోవాలి. ఏదైనా పరిస్థితుల్లో మోసానికి గురైనట్లు తెలిస్తే వెంటనే 1930కి సమాచారం అందించాలి. ఎక్కువ ఆలస్యం అయితే నష్టపోయే పరిస్థితి ఉంటుంది.

వీటిని నమ్మవద్దు

బ్యాంకుల పేరుతో వచ్చే నకిలీ కాల్స్‌ను నమ్మవద్దు. అకౌంట్ బ్లాక్ అయింది. అప్‌డేట్ కోసం పాన్‌కార్డు నెంబరు, ఓటీపీలను అడిగితే చెప్పవద్దు

మీ కుటుంబ సభ్యులపై కేసు నమోదైంది, క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్నారంటూ నకిలీ ఎఫ్ఐఆర్, అరెస్టు వారెంట్ పత్రాలు పంపించి భయాందోళనకు గురి చేస్తారు. వీటితో డబ్బులను డిమాండ్ చేసే అవకాశం ఉంది.

సైబర్ మోసంలో మీరు డబ్బులు పోగొట్టుకున్నారని, వివరాలు సమర్పిస్తే డబ్బులు తిరిగి వస్తాయంటూ మోసగాళ్లు నకిలీ లింక్‌లను పంపిస్తారు. వీటిని క్లిక్ చేస్తే డబ్బులు పోయే అవకాశం ఉంది.

బ్యాంకు లోగో, ఇతర డీపీలతో బ్యాంకు పేరిట ఏపీకే ఫైల్స్‌ను వాట్సప్ లేదా ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా పంపిస్తారు. వాటిని క్లిక్ చేయడంతో మన చరవాణి నియంత్రణ మోసగాడి చేతుల్లోకి వెళ్లిపోతుంది.

వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో చిత్రాలను మార్ఫింగ్ చేసి ఇబ్బందులకు గురి చేసి డబ్బులు డిమాండ్ చేసే అవకాశం ఉంది. లేదంటే ఆ చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంపిస్తామంటూ బెదిరింపులకు పాల్పడతారు. మహిళలు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

ఇంటి వద్దే ఉద్యోగాలు ఇస్తామని, తక్కువ ధరకే వాహనాలు ఇస్తామంటూ మోసాలకు పాల్పడతారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఏవైనా యాప్‌ల పేరుతో వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దు.

అప్రమత్తంగా ఉండాలిహసీద్ ఉల్లా, సైబర్ క్రైం డీఎస్పీచరవాణులకు వచ్చే నకిలీ వెబ్‌సైట్, నకిలీ బ్యాంకు యాప్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు. బ్యాంకుల పేరుతో, ఉద్యోగాలు, తక్కువ డబ్బులు చెల్లిస్తే ఎక్కువ వస్తాయంటూ నమ్మిస్తారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి సమాచారం ఇవ్వాలి. లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.



# త్వరలో పట్టాలెక్కనున్న వందే భారత్ స్లీపర్

దిల్లీ: దేశంలో మొట్టమొదటిసారిగా వందే భారత్ స్లీపర్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. స్లీపర్ రైలును అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లుగా అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం వందే భారత్ రైళ్లు ఛైర్‌కార్ సర్వీసులను మాత్రమే అందిస్తున్నాయి. ఈనేపథ్యంలో స్లీపర్ ట్రైన్‌ను మరో రెండు నెలల్లో అంటే ఆగస్టు 15 నాటికి ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ దీనిని ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ స్లీపర్ రైలు పనులను పర్యవేక్షించడానికి బెంగళూరు వెళ్లారు. వందేభారత్ స్లీపర్ రైలు తయారీ చివరిదశలో ఉందని ఆయన పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ రైలు దిల్లీ, ముంబయి రైల్వే మార్గంలో నడుస్తోందని, రద్దీగా ఉండే ఈ మార్గంలో స్లీపర్ రైలును అందుబాటులోకి తీసుకువస్తే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. స్లీపర్ ట్రైన్ దిల్లీ నుంచి భోపాల్, సూరత్ మీదుగా ముంబయి చేరుకుంటుందని తెలిపాయి. త్వరలో పట్టాలెక్కనున్న ఈ స్లీపర్ రైల్లో మొత్తం 16 బోగీలు ఉంటాయని అందులో 10 థర్డ్ ఏసీకి, 4 సెకండ్ ఏసీకి, ఒక బోగీ ఫస్ట్ ఏసీకి కేటాయించారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. వందే భారత్ స్లీపర్ రైలులో సీటింగ్‌తో పాటు లగేజీ కోసం రెండు బోగీలు అందుబాటులో ఉంటాయి. గంటకు 130 కి.మీ. వేగంతో నడిచే ఈ రైలు వేగాన్ని కొద్ది రోజుల అనంతరం క్రమంగా గంటకు 160-220 కి.మీ.లకు పెంచనున్నారు.



# లోక్‌సభలో తెలంగాణ ఎంపీల నినాదాలు

## ఎంపీలుగా తెలంగాణ నేతలు ప్రమాణస్వీకారం.. ఒవైసీ వివాదాస్పద నినాదాలు

ఢిల్లీ: తెలంగాణ ఎంపీలు లోక్‌సభలో నేడు (మంగళవారం) ప్రమాణస్వీకారం చేశారు. కాంగ్రెస్, బీజేపీ సభ్యులతో పాటు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా ప్రమాణం చేశారు. ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఎంపీలు గడ్డం వంశీ కృష్ణ, ధర్మపురి అరవింద్, రఘునందనరావు, కొండా విశ్వేశ్వరరెడ్డి, రామసాయం రఘురాం రెడ్డి ఇంగ్లీష్‌లో ప్రమాణం చేశారు. ఇక సురేశ్ షెట్కర్, ఈటల రాజేందర్, డీకే అరుణ, మల్లు రవి, కుందూరు రఘువీర్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్ తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. ఇక హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఉర్దూలో ప్రమాణం చేశారు. కాగా ప్రమాణస్వీకారం సందర్భంగా తెలంగాణ ఎంపీలు కొందరు ఆసక్తికరమైన నినాదాలు చేశారు. ఎవరెవరు ఏం నినాదాలు చేశారంటే.. 1. జై సమ్మక్క సారలమ్మ అని నినాదం చేసిన ఈటల రాజేంధర్, 2. జై లక్ష్మీ నర్సింహ స్వామి అని నినదించిన కిరణ్‌కుమార్ రెడ్డి, 3. జై భద్రకాళి అని నినాదం చేసిన కడియం కావ్య, 4. జై తుల్జా భవాని అన్న బలరాం నాయక్, 5. జై భీం అని నినదించిన ఎంపీలు మల్లురవి, కావ్య, రఘురాంరెడ్డి

**వివాదాస్పదంగా మారిన అసదుద్దీన్ నినాదాలు :** ప్రమాణస్వీకారం పూర్తయిన సందర్భంగా ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన నినాదాలు చర్చనీయాంశంగా మారాయి. 'జై పాలస్తీనా, అల్లాహొ అక్బర్' అంటూ అసదుద్దీన్ తన ప్రమాణం పూర్తి చేయడం ఇందుకు కారణమైంది. జై పాలస్తీనా నినాదం ఇవ్వడంపై పలువురు మంత్రులు, బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా నిబంధనలు పరిశీలించి... రికార్డుల నుంచి తొలగించే విషయాన్ని పరిశీలిస్తానని సభాపతి స్థానంలో రాధామోహన్ సింగ్ సభ్యులకు సర్దిచెప్పారు. నిబంధనల ప్రకారం వ్యవహరిస్తానని ఆయన తెలిపారు.

# తెలుగులో ప్రమాణస్వీకారం చేసిన తమిళనాడు ఎంపీ

దిల్లీ: 18వ లోక్‌సభలో ఎంపీల ప్రమాణస్వీకారం కొనసాగుతోంది. ఈ సందర్భంగా పలు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. తమిళనాడు నుంచి ఎంపీగా గెలుపొందిన కె.గోపీనాథ్ తెలుగులో ప్రమాణస్వీకారం చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంపీగా విజయం సాధించిన ఆయన.. రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. చివరలో జై తమిళనాడు అని నినాదం చేశారు. గతంలో తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికైన సమయంలోనూ ఆయన తెలుగులోనే ప్రమాణస్వీకారం చేశారు. అంతేకాకుండా పలు అంశాలపై తెలుగులోనే అడగ్గా.. అప్పటి ముఖ్యమంత్రి జయలలిత తెలుగులోనే సమాధానాలు ఇచ్చేవారు. మహారాష్ట్రకు చెందిన పలువురు సభ్యులు మంగళవారం ఎంపీలుగా ప్రమాణస్వీకారం చేశారు. ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే ప్రమాణస్వీకారం అనంతరం ప్రొటెం స్పీకర్ భర్తృహరి కాళ్లకు నమస్కరించారు. అనంతరం భాజపా సీనియర్ నేత, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆశీస్సులు తీసుకున్నారు. మహారాష్ట్ర ఎంపీలు ప్రమాణస్వీకారం తర్వాత జైహింద్, జై మహారాష్ట్ర, జైభీం, జై శివాజీ అంటూ నినాదాలు చేయగా.. ప్రమాణస్వీకార పత్రంలో ఏముందో అదే చెప్పాలని ప్రొటెం స్పీకర్ సభ్యులకు సూచించారు. సోమవారం ప్రధాని నరేంద్ర మోదీతో పాటు 262మందితో ప్రమాణస్వీకారం చేయించగా.. మిగతా సభ్యుల ప్రమాణస్వీకారం కొనసాగుతోంది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194



# కాంగ్రెస్‌ను వీడను

## నేను కాంగ్రెస్ పార్టీని వదిలే ప్రసక్తే లేదు: జీవన్ రెడ్డి కీలక ప్రకటన

జగిత్యాల: 'రాజీనామా సస్పెన్స్'కు తెరదించుతూ కాంగ్రెస్ సీనియర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. తాను కాంగ్రెస్ పార్టీని చేయబోనని ఆయన ప్రకటించారు. " నేను కాంగ్రెస్ పార్టీని వదిలే ప్రసక్తే లేదు. కాంగ్రెస్ పార్టీలోనే ఉంటాను. చేరికల విషయంలో మనస్థాపం చెందాను. నేను ఇప్పుడు ఎమ్మెల్సీగా ఉన్నాను. ఎమ్మెల్సీగా అసెంబ్లీకి వెళ్లే హక్కు నాకు ఉంది. నా కార్యకర్తలు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటాను" అని జీవన్ రెడ్డి మంగళవారం ప్రకటించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు చర్చల అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు.

**జీవన్ రెడ్డి మా అందరికీ మార్గదర్శకులు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క –** జీవన్ రెడ్డి నివాసంలో చర్చల అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సీనియర్ నాయకులు అని, తమ అందరికీ ఆయన మార్గదర్శకులు అని భట్టి అన్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనుభవాన్ని ప్రభుత్వం నడవడం కోసం తప్పనిసరిగా వినియోగించుకుంటామని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని 10 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ జెండాను భుజాన మోస్తూ.. పార్టీ భావజాలాన్ని చట్టసభల్లో వినిపించిన సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి అని కొనియాడారు. ఈ ప్రభుత్వం నడవడం కోసం వారి ఆలోచనలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకుంటామని, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సీనియార్టీకి ఎలాంటి భంగం కలిగించకుండా పార్టీ సముచిత ప్రాధాన్యమిచ్చి గౌరవిస్తుందని భట్టి ప్రకటించారు. సీనియర్ నాయకులను ఎట్టి పరిస్థితుల్లో పార్టీ వదులుకోవడానికి సిద్ధంగా లేదని, పార్టీలో ఉన్న సీనియర్ నాయకులు మనస్థాపం చెందితే తామంతా బాధపడతామని చెప్పారు. కాగా జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ హైకమాండ్ మంత్రి పదవి ఆఫర్ చేసిందని తెలుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చు కోవడంపై జీవన్‌రెడ్డి కినుక వహించిన విషయం తెలిసిందే. తీవ్ర అసంతృప్తికి గురైన ఆయన రాజీనామాకు సిద్ధమయ్యారు. నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్న తనను మాటమాత్రంగానైనా సంప్రదించకుండా తన సొంత నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పార్టీలో చేర్చుకోవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఇది తనను అగౌరవపరిచినట్లేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జగిత్యాల కాంగ్రెస్ నాయకులే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన వందలాది కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు సైతం సోమవారం ఉదయమే జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. రాత్రి వరకూ అక్కడే ఉండి జీవన్‌రెడ్డి ఆవేదనలో పాలుపంచుకున్నారు.

# నాడు ఎమర్జెన్సీ విధించి.. నేడు రాజ్యాంగంపై 'ప్రేమ' నాటకాలా?: మోదీ



దిల్లీ: దేశంలో అత్యయిక స్థితి ఏర్పడి మంగళవారం నాటికి 49 ఏళ్లు పూర్తయి 50వ ఏడాదిలోకి అడుగుపెడుతున్నాం. ఈసందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎక్స్ వేదికగా సుదీర్ఘ పోస్ట్‌లు పెట్టారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు భాజపా ప్రయత్నిస్తోందంటూ కాంగ్రెస్ చేస్తోన్న ఆరోపణలకు ప్రధాని గట్టిగా బదులిచ్చారు. రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కి దేశాన్ని జైల్లో పెట్టింది వారేనంటూ హస్తం పార్టీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "ఎమర్జెన్సీని ఎదిరించిన మహనీయులందరికీ నివాళులర్పించే రోజు ఇది. ప్రజల ప్రాథమిక స్వేచ్ఛను కాంగ్రెస్ ఎలా అణగదొక్కిందో.. ప్రతీ భారతీయుడు గౌరవించే దేశ రాజ్యాంగాన్ని ఎలా తుంగలో తొక్కారో నాటి చీకటిరోజులే మనకు గుర్తు చేస్తాయి. కేవలం అధికారాన్ని కాపాడుకోవడం కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విధానాలను విస్మరించి దేశం మొత్తాన్ని జైల్లో పెట్టింది. ఆ పార్టీని వ్యతిరేకించిన వారిని హింసించారు. బడుగు, బలహీన వర్గాలను లక్ష్యంగా చేసుకుని దారుణమైన విధానాలను అమల్లోకి తెచ్చారు" అని మోదీ నాటి పరిస్థితులను గుర్తుచేశారు.

**50వ ఏడాదిలోకి 'ఎమర్జెన్సీ'** "నాడు ఎమర్జెన్సీని విధించిన వారికి (కాంగ్రెస్) ఇప్పుడు రాజ్యాంగంపై ప్రేమను వ్యక్తపరిచే హక్కు లేదు. ప్రతికా స్వేచ్ఛను నాశనం చేయడానికి ఎన్నో బిల్లులు తీసుకొచ్చారు. ఫెడరల్ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. రాజ్యాంగంలోని ప్రతీ అంశాన్ని ఉల్లంఘించారు. నాటి సంకుచిత, కుటిల మనస్తత్వం ఆ పార్టీ నేతల్లో ఇంకా సజీవంగానే ఉంది. రాజ్యాంగంపై తమకున్న అయిష్టాన్ని దాచిపెట్టి వారు ఇప్పుడు నటిస్తున్నారు. కానీ చేష్టల్లో వారి ప్రవర్తనను ప్రజలు అర్థం చేసుకున్నారు. అందుకే పదేపదే వారిని తిరస్కరిస్తున్నారు" అంటూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష ఇండియా కూటమి పలుమార్లు రాజ్యాంగం మార్పు అంశాన్ని లేవనెత్తిన సంగతి తెలిసిందే. ఎన్డీయే మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని ఏకపక్షంగా మార్చేస్తారని విపక్ష నేతలు ఆరోపించారు. దీన్ని మోదీ సర్కారు ఎప్పటికప్పుడు కొట్టిపారేసింది. 18వ లోక్‌సభ తొలి సమావేశాల ప్రారంభ సమయంలోనూ రాజ్యాంగ ప్రతులను పట్టుకుని విపక్షాలు నిరసన వ్యక్తంచేశాయి. అయితే, ఈ సమావేశాలకు ముందు ప్రధాని మాట్లాడుతూ ఎమర్జెన్సీ అంశాన్ని ప్రస్తావించారు. అత్యయిక స్థితి దేశ చరిత్రపై మాయని మచ్చ అని, నాటి పొరపాటు భవిష్యత్తులో మళ్లీ జరగొద్దని అన్నారు.

# డ్రగ్స్ వినియోగం.. విష ప్రయోగం లాంటిది: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్: రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ఏ స్థాయిలో అయినా నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో జలవిహార్ వద్ద డ్రగ్స్ నిర్మూలన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. "డ్రగ్స్ వినియోగం విష ప్రయోగం లాంటిది.. ఇది అత్యంత ప్రమాదకరం. కుటుంబ వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తుంది. డ్రగ్స్ సరఫరా చేస్తున్న సంఘ విద్రోహశక్తుల చేతిలో యువత జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయి. తెలిసీ తెలియని వయసులో వాటి బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొందరు కావాలనే తమ అక్రమ సంపాదన కోసం యువతకు డ్రగ్స్ అంటగడుతున్నారు. దేశాన్ని బలహీనపరిచేందుకు దేశద్రోహులు చేస్తున్న ప్రయత్నంగానూ దీన్ని చూడొచ్చు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత మనపైనే ఉంది. డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్ బ్యూరోకు ఎంత బడ్జెట్ అయినా కేటాయిస్తాం. వాటి వినియోగం, రవాణా లేకుండా చేయాల్సిన బాధ్యత ఆ అధికారులదే. పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా ప్రజల నుంచి కూడా సహకారం అందాలి. డ్రగ్స్ సరఫరా చేసేవారు ఎక్కడున్నా అరెస్ట్ చేసే శక్తి సామర్థ్యాలు పోలీసు వ్యవస్థకు ఉన్నాయి. పోలీసులకు



సమాచారం ఇచ్చే వ్యవస్థను బలోపేతం చేసుకోవాలి. అన్ని గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు వేయాలి. కొత్త వ్యక్తులపై ఎల్లప్పుడూ నిఘా ఉంచాలి. తాత్కాలిక సంతోషాలకు విద్యార్థులు బలి కావొద్దు. వారు అడ్డదారులు తొక్కితే కుటుంబంతో పాటు సమాజం మొత్తం బాధపడాల్సి ఉంటుంది" అని భట్టి విక్రమార్క అన్నారు.

# భారాస అధినేత కేసీఆర్‌కు హైకోర్టులో ఊరట

హైదరాబాద్: భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. రైలు రోకో కేసులో.. తదుపరి ఉత్తర్వుల వచ్చే వరకూ విచారణపై కోర్టు స్టే విధించింది. విచారణను వచ్చే నెల 23కు వాయిదా వేసి.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

2011లో రైలురోకోకు కేసీఆర్ పిలుపునివ్వడంతో కేసు నమోదైంది. ప్రజాప్రతినిధుల కోర్టులో తనపై ఉన్న కేసు కొట్టివేయాలని కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

**తెలంగాణ విద్యుత్ కమిషన్‌పై హైకోర్టుకు..** మరోవైపు తెలంగాణలో జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో కేసీఆర్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

కమిషన్ ఏర్పాటు సహజన్యాయ సూత్రాలకు విరుద్ధమని.. నిబంధనల మేరకే విద్యుత్ కొనుగోలు జరిగిందని పేర్కొన్నారు. జస్టిస్ నర్సింహారెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టి మరీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని తన పిటిషన్‌లో వెల్లడించారు. విద్యుత్ కమిషన్, జస్టిస్ నర్సింహారెడ్డి, ఎనర్జీ విభాగాన్ని ప్రతివాదులుగా చేర్చారు.

# జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌పై హైకోర్టుకు కేసీఆర్

తెలంగాణలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, కొత్త థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను రద్దు చేయాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఆ కమిషన్‌ను రద్దు చేయాలని రిట్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఏర్పాటు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉందని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. నిబంధనల మేరకే విద్యుత్ కొనుగోలు జరిగిందని పునరుద్ఘటించారు. జస్టిస్ నరసింహారెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టి మరీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కేసులో కమిషన్, జస్టిస్ నరసింహారెడ్డి, ఎనర్జీ విభాగాలను ప్రతివాదులుగా ఉన్నారు. కాగా, తెలంగాణలో గత పదేండ్ల కాలంలో జరిగిన విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, కొత్త థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణంపై విచారణ జరిపేందుకు గత మార్చి 14న రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఏకసభ్య విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్- 1952 కింద ఏర్పాటైన ఈ కమిషన్ ఇప్పటికే విచారణను ప్రారంభించి, తెలంగాణ విద్యుత్తు సంస్థలకు చెందిన దాదాపు 25 మంది అధికారులను, మాజీ అధికారులను విచారించింది. దీంతో పాటు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కూడా ఈ నెల 15వ తేదీలోపు వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ 12 పేజీల సుదీర్ఘ లేఖను ఈ నెల 15వ తేదీన కమిషన్‌కు పంపించారు. తెలంగాణలో విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, కొత్త థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన విచారణ కమిషన్ చెల్లదని కేసీఆర్ ఆ లేఖలో స్పష్టంచేశారు. ఎంక్వైరీ కమిషన్ బాధ్యతలు స్వీకరించిన హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నర్సింహారెడ్డికి ఈ అంశాలపై విచారణ జరిపే అర్హత లేదని తేల్చిచెప్పారు. విచారణ కమిషన్ బాధ్యతల నుంచి వెంటనే స్వచ్ఛందంగా వైదొలగాలని (రెక్యూజ్ కావాలని) జస్టిస్ నర్సింహారెడ్డికి కేసీఆర్ విజ్ఞప్తిచేశారు. మిషన్ టర్మ్స్ అండ్ రిఫరెన్సెస్‌లో ప్రభుత్వం పేర్కొన్న అంశాలకు, జస్టిస్ నర్సింహారెడ్డి విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు కేసీఆర్ ఆ లేఖలో సూటిగా, దీటుగా బదులిచ్చారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660